సాక్షి
నిర్మల్
శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



ధీరనారీ.. ధైర్యశాలి 8లో▸
ఎస్పీ జానకీ షర్మిల 'నారీశక్తి' కార్యక్రమంలో మహిళా కానిస్టేబుళ్లకు పెట్రోలింగ్ విధులను కేటాయించారు. అద్భుత పనితీరుతో జిల్లా ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు.



కడెం ప్రాజెక్ట్‌పై ఫోకస్ 8లో▸
కడెం ప్రాజెక్ట్‌కు 2022, 2023లో వచ్చిన భారీ వరద ప్రజలను భయాందోళనకు గురిచేసింది. అప్పటి నుంచి వానాకాలం వచ్చిందంటే అందరి దృష్టి ప్రాజెక్టుపై..

గరిష్టం/కనిష్టం
31.3 /25.6

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

గంజాయిపై దృష్టి పెట్టాలి

నిర్మల్ టౌన్: పోలీస్ అక్క విధుల్లో భాగంగా మహిళా పోలీసులు గంజాయిపై దృష్టి పెట్టాలని ఎస్పీ జానకీషర్మిల సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో మహిళ పోలీస్ సిబ్బందితో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మహిళా పోలీసులు తమ స్టేషన్ పరిధిలో గంజాయి సంబంధిత కార్యకలాపాలను నిర్మూలించడంలో చురుకుగా పాల్గొనాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై యువతకు అవగాహన, చైతన్యం కల్పించాలని సూచించారు. అనంతరం మహిళా పోలీసులకు బ్యాడ్జీలు, బ్యాగులు, టీ షర్టులు పంపిణీ చేశారు.

4న జిల్లాస్థాయి పోటీలు

భైంసారూరల్: జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భైంసా పట్టణంలోని వినాయక్‌నగర్ గౌతమి హైస్కూల్‌లో ఈనెల 4న జిల్లాస్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు అన్నపూర్ణ, ప్రధాన కార్యదర్శి మల్లేశ్ తెలిపారు. అండర్ 10–14, 14–18 క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఆసక్తిఉన్న క్రీడాకారులు ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు 94911 25216, 90639 81532 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

5న ఉపాధ్యాయుల ధర్నా

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 5న జిల్లా కేంద్రంలో ధర్నా చేయనున్నట్లు టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెంట అశోక్ తెలిపారు. మండలంలోని వెంగ్వాపేట్ ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన గణిత శాస్త్ర కాంప్లెక్స్ సమావేశంలో ధర్నా కరపత్రాలు విడుదల చేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావొస్తున్నా మేనిఫెస్టోలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. తప్పని పరిస్థితుల్లో మూడు దశల్లో ఉద్యమ పోరాటానికి పిలుపు ఇచ్చామని తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 5న నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

జిల్లా కోర్టు భవనానికి స్థలం

నిర్మల్‌చైన్‌గేట్: సారంగాపూర్ మండలం చించోలి(బి) గ్రామ శివారులోని 6.32 ఎకరాలు జిల్లా కోర్టు భవన నిర్మాణానికి అధికారులు కేటాయించారు. ఈ స్థలాన్ని రెవెన్యూ, న్యాయ శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. ఇందులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాధిక, ఆర్డీవో రత్నకళ్యాణి, తహసీల్దార్ శ్రీదేవి, ఇతర న్యాయ, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

7న ఇంటర్వ్యూ

నిర్మల్‌చైన్‌గేట్: నిర్మల్ ప్రభుత్వ వైద్య కళాశాలలో కాంట్రాక్టు పద్ధతిలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఈనెల 7న ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ సీవీ.శారద తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు కాలేజీ వెబ్‌సైట్ (www.gmcnirmal.com) నుంచి అప్లికేషన్ ఫారం డౌన్‌లోడ్ చేసుకుని, పూర్తి వివరాలు పూరించి, ఆగస్టు 7 ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల జిరాక్స్ పత్రాలతో రావాలని వివరించారు. పూర్తి వివరాలు కాలేజీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

తెయూ ఉన్నా.. కేయూలోనే..

'పొద్దునపూట నిర్మల్ నుంచి నేరుగా వరంగల్‌కు బస్సు లేదంటే.. వేకువజామున 4 గంటలకే బండి తీసుకుని నిర్మల్‌కు వచ్చిన. 5 గంటలకు హైదరాబాద్ బస్సెక్కి ఆర్మూర్‌లో దిగిన. అక్కడి నుంచి హన్మకొండ బస్సెక్కి కాకతీయ యూనివర్సిటీకి చేరేసరికి.. ఉదయం 11.30 అయ్యింది. తీరా.. వర్సిటీలో పనికావాల్సిన విభాగానికి వెళ్లేసరికి.. 'సార్ ఈరోజు రాలేదు. రేపురాపో..' అని అక్కడ సిబ్బంది చెప్పడంతో అప్పటికి టిఫిన్ కూడా చేయకపోవడంతో నీరసం రెండింతలయ్యింది. మళ్లీ.. ఏడున్నర గంటల ప్రయాణం చేసి, ఇంటికి వెళ్లిరావాలంటే తలప్రాణం తోకకొస్తుంది. చేసేది లేక, దగ్గరలో లాడ్జీ తీసుకుని ఆరోజంతా వృథాగా గడపాల్సి వచ్చింది. మరుసటి రోజు పనిచేసుకుని మధ్యాహ్నం బయలుదేరితే.. రాత్రి 10గంటలకు ఇంటికి చేరుకున్న. చిన్న సర్టిఫికెట్ పనికోసం ఎంతో వ్యయప్రయాసలు పడాల్సి వచ్చింది. అసలు మాకెందుకీ ఖర్మ అన్న ఫీలింగ్ వచ్చింది..'



తెలంగాణ, కాకతీయ యూనివర్సిటీల ముఖద్వారం

- జిల్లా డిగ్రీ కళాశాలలకు తప్పని పాట్లు
- ఈ 'దూరభారం'.. ఇంకెన్నేళ్లు?
- 'వరంగల్ వెతలు' తప్పేదెప్పుడూ..!?
- పాలకులూ.. పట్టించుకోరా..!?

నిర్మల్: ఎక్కడో వరంగల్‌లో ఉన్న కాకతీయ యూనివర్సిటీకి వెళ్లిరావాలంటేనే చాలా ఇబ్బంది. తీరా.. అక్కడికి వెళ్లిన తర్వాత ఆరోజు పనవుతుందా.. లేదా..! అన్న గ్యారంటీ ఉండదు. అసలు ఈ కథంతా ఎందుకు..!? ఇంతటి వ్యథ అనుభవించాల్సిన ఖర్మ మాకెందుకు..!? అన్న వాదనలు వస్తున్నాయి. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలకు అత్యంత సమీపంలోనే నిజామాబాద్‌జిల్లాలో ఉన్న తెలంగాణ యూనివర్సిటీ(తెయూ)కి ఇక్కడి కాలేజీలను అఫ్లియేషన్(అనుబంధం) ఎందుకు చేయడం లేదన్న ప్రశ్న దాదాపు రెండు దశాబ్దాలుగా వస్తూనే ఉంది. కానీ.. కనీసం పట్టించుకునే నాథుడే లేకపోవడం ఇక్కడి దౌర్భాగ్యం.

రెండు వర్సిటీలూ కాదని..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు నిజామాబాద్‌లో తెలంగాణ, కరీంనగర్‌లో శాతవాహన యూనివర్సిటీలు సమీపంలో ఉన్నాయి. అయినా అధికారులు, పాలకులు ఈ రెండింటినీ కాదని, ఇప్పటికీ ఉమ్మడి జిల్లా కళాశాలలను కేయూ అనుబంధంగానే కొనసాగించడం దారుణం. అసలు.. ఉమ్మడి జిల్లాలోనూ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ప్రధానంగా నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో వర్సిటీ కోసం చాలా ఏళ్లుగా గొంతెత్తుతున్నారు. కానీ.. ఇప్పటికీ ఆ దిశగా కదలిక కనిపించడం లేదు. కనీసం.. దూరభారంగా ఉన్న కాకతీయ నుంచి సమీపంలో ఉన్న యూనివర్సిటీల పరిధిలోకీ అఫ్లియేషన్ తీసుకురావడం లేదు.

తెలంగాణ వర్సిటీ ఏర్పడినా..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి 2006లో నిజామాబాద్ జిల్లాలో తెలంగాణ యూనివర్సిటీ(తెయూ)ను ప్రారంభించారు. మొదట్లో అక్కడి గిరిరాజ్ కాలేజీలోనే తరగతులు కొనసాగించారు. అనంతరం డిచ్‌పల్లి సమీపంలోని ఎన్‌హెచ్.44 పక్కనే విశాలమైన యూనివర్సిటీ క్యాంపస్‌ను ఏర్పాటు చేశారు. తెయూ ఏర్పడి దాదాపు రెండు దశాబ్దాలు కావస్తున్నా.. ఇప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డిగ్రీ, పీజీ కాలేజీలను వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న కాకతీయ యూనివర్సిటీ పరిధిలోనే కొనసాగిస్తున్నారు. ఇక్కడి కాలేజీలను తెయూ అనుబంధం(అఫ్లియేషన్) చేయడం లేదు.

ఇప్పటికీ చిన్నచూపే..

దూరంగా ఉందనో.. అడిగేదెవరనో.. తెలియదు కానీ.. ఇప్పటికీ కాకతీయ యూనివర్సిటీకి నిర్మల్, ఆదిలాబాద్ ప్రాంతాలపై చిన్నచూపు ఉందని చాలామంది విద్యావంతులు, విద్యార్థులు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు. ఈక్రమంలోనే నిర్మల్‌లో ఉన్న యూనివర్సిటీ పీజీ సెంటర్‌ను నిర్లక్ష్యం చేశారని వాదిస్తున్నారు. ఒకప్పుడు కేయూ పరిధిలోనే ఎంతో పేరున్న ఎంఏ సోషియాలజీ, మంచి డిమాండ్ ఉన్న ఎంఏ ఇంగ్లిష్ వంటి సబ్జెక్ట్‌లను ఇక్కడి స్థానికులకు దూరం చేశారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికీ పీజీ సెంటర్‌కు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కనీసం కృషిచేయడం లేదంటున్నారు. అందుకే.. 'కేయూ వద్దు.. తెయూ ముద్దు' అంటున్నారు.

నిర్మల్,ఆదిలాబాద్‌లో డిగ్రీ కాలేజీలు..

జిల్లాలు	ప్రభుత్వ	ప్రైవేటు	మొత్తం
నిర్మల్	05	21	26
ఆదిలాబాద్	04	22	26

దూరమూ.. భారమే..

ప్రధానంగా ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల విద్యార్థులు, కాలేజీలకు కాకతీయ యూనివర్సిటీ దూరభారంగా మారింది. ఈ రెండు జిల్లాల నుంచి వరంగల్ దాదాపు 270–300కిలోమీటర్ల దూరం ఉంది. ఎంత తక్కువన్నా.. కనీసం 6గంటల ప్రయాణం చేయాల్సి ఉంటుంది. రానుపోనూ అంటే 12 గంటల జర్నీ అవుతుంది. అదే.. తెలంగాణ యూనివర్సిటీ నిర్మల్ నుంచి కేవలం 65 కి.మీ.దూరం, గంట ప్రయాణం. ఆదిలాబాద్ నుంచి 145కి.మీ. మాత్రమే. ఇంత దగ్గరలో తెలంగాణ వర్సిటీ ఏర్పడి 20 ఏళ్లు కావస్తున్నా.. ఇప్పటికీ అఫ్లియేషన్ చేపట్టకపోవడంపై అన్నివర్గాల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఇంకెన్నాళ్లు.. ఈ 'వరంగల్ వెతలు' పడాలని ప్రశ్నిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత పాలనను ప్రజలకు చేరువ చేసేందుకు జిల్లాల పునర్విభజన చేశారు. దీంతో పాలనాధికారులు ప్రజలకు చేరువయ్యారు. కానీ, వర్సిటీలు మాత్రం విద్యార్థులకు చేరువ కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

హస్తకళలను ప్రోత్సహిద్దాం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



కార్యక్రమంలో నృత్య ప్రదర్శన..

- కలెక్టర్ అభిలాష అభినవ్
- పెంబి ఆస్పిరేషన్ బ్లాక్‌కు జాతీయ స్థాయి గుర్తింపుపై హర్షం
- ఆకాంక్ష హాత్ పేరుతో ఐదు రోజుల ప్రదర్శన, అమ్మకాలు ప్రారంభం

నిర్మల్‌చైన్‌గేట్: టెక్నాలజీ పెరిగిన తర్వాత చేతి వృత్తులకు ఆదరణ కరువవుతోందని, కానీ, హస్త కళలకు ఉన్న ప్రాధాన్యతను అందరూ గుర్తించి ప్రోత్సహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మహిళల ఆలోచనలు వెలుగులోకి తెచ్చేందుకు మహిళా సంఘాలు తోడ్పాటునిస్తాయని పేర్కొన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో ఆకాంక్ష హాత్ పేరుతో ఏర్పాటు చేసిన హస్త కళల ప్రదర్శనను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్‌తో కలిసి గురువారం ప్రారంభించారు. పలు స్టాల్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీతి అయోగ్ ఆస్పిరేషన్ బ్లాక్ కార్యక్రమంలో పెంబి మండలం జాతీయ స్థాయిలో 4వ ర్యాంకు సాధించిందని తెలిపారు. మొత్తం 500 మండలాల్లో పెంబికి 4వ ర్యాంకు రావడం గర్వకారణమన్నారు. త్వరలోనే పలువురు జిల్లా అధికారులు రాష్ట్రస్థాయిలో జరగబోవు కార్యక్రమంలో గవర్నర్ చేతుల మీదుగా కాంస్య పతకం అందుకోనున్నట్లు తెలిపారు. మూడు నెలలపాటు జరిగిన సంపూర్ణత అభియాన్ కార్యక్రమంతో పెంబి ఆస్పిరేషన్ నుంచి ఇన్‌స్పిరేషన్‌గా మారిందన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పోషణ, సామాజిక అంశాల్లో మెరుగైన అభివృద్ధి సాధించిందని వివరించారు. గర్భిణుల నమోదు, డయాబెటిస్ స్క్రీనింగ్, సప్లిమెంటరీ న్యూట్రీషియన్‌లో వందశాతం పరిపూర్ణత సాధించడంతోపాటుగా హెల్త్ కార్డుల జారీలో 70 శాతం, మహిళా సంఘాల రుణాల విషయంలో 94 శాతం పరిపూర్ణత సాధించినట్లు వెల్లడించారు. నీతి అయోగ్ ఆకాంక్ష హాత్ కార్యక్రమం ఆగస్టు 4వ తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఐదు రోజులపాటు మహిళా సంఘాల హస్తకళలు ప్రదర్శనలతోపాటు, అమ్మకాలు ఉంటాయన్నారు.

జాతీయ పురస్కారం సంతోషకరం..

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ మాట్లాడుతూ నీతి అయోగ్ పెంబి ఆస్పిరేషన్ బ్లాక్‌కు జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకు రావడం సంతోషకరమన్నారు. పెంబిని ఉత్తమ స్థానంలో నిలిచేందుకు కృషిచేసిన జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా అధికారు, పెంబి మండల అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అధికారులు అంకిత భావంతో పనిచేయడంతోనే ఉత్తమ ర్యాంకు సాధ్యమైందన్నారు. మహిళలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ సొంత కాళ్లపై నిలబడాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పలువురు విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలను ప్రదర్శించారు. పెంబి మండల అధికారులు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు.. ఏఎన్ఎంలు, ఇతర ఫ్రంట్‌లైన్ ఉద్యోగులను కలెక్టర్ ఎమ్మెల్యేలు శాలువాతో సన్మానించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమ ప్రారంభానికి ముందు అంబేడ్కర్ భవన్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్, ఎమ్మెల్యేతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్, జిల్లా అధికారులు, పెంబి మండల అధికారులు, సిబ్బంది, మహిళా స్వయం సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల ప్రమోషన్ షెడ్యూల్ విడుదల

నిర్మల్‌రూరల్: ఉపాధ్యాయుల ప్రమోషన్ షెడ్యూల్‌ను గురువారం ప్రభుత్వం ప్రకటించింది. ఈనెల 2న ప్రక్రియ ప్రారంభమై 11 వరకు పది రోజుల్లో ప్రక్రియ ముగియనుంది. మొదట స్కూల్ అసిస్టెంట్లకు పీజీ హెచ్‌ఎంలుగా, ఆ తర్వాత ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్లు ఇవ్వనున్నారు. ఈ మేరకు పూర్తి విధి విధానాలు, దరఖాస్తు తేదీలను రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ప్రకటించారు. ఈనెల 2న గెజిటెడ్ హెడ్ మాస్టర్ల వేకెన్సీ జాబితా ప్రొవిజినల్ సీనియార్టీ లిస్టు టీటీటీ. టఖజ్రాా ్ఛీం్ఛ్చుఝ్చిు. జౌ్ట. జీఽ వెబ్‌సైట్‌లో ఉంచుతారు. 3న ప్రొవిజినల్ సీనియారిటీ లిస్టుపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. 4, 5 తేదీల్లో అభ్యంతరాలపై సీనియార్టీ లిస్టును సరిచేసి, ఫైనల్ లిస్టును ప్రకటిస్తారు. ఈనెల 6న పీజీహెచ్‌ఎం కోసం అర్హులైన స్కూల్ అసిస్టెంట్లు వెబ్‌ఆప్షన్ల నమోదు చేసుకోవాలి. 7న ప్రమోషన్ ఆర్డర్లను ప్రకటిస్తారు. 8, 9 తేదీల్లో జిల్లాలోని స్కూల్ అసిస్టెంట్ వేకెన్సీ జాబితాను ప్రకటించి, అభ్యంతరాలను స్వీకరించి, ఫైనల్ సీనియార్టీ లిస్టును ప్రకటిస్తారు. 11న స్కూల్ అసిస్టెంట్ ప్రమోషన్ల కోసం ఎస్జీటీ ఉపాధ్యాయుల నుంచి వెబ్‌ఆప్షన్ నమోదు చేసుకోవాలి. 11న స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ ఆర్డర్లను ప్రకటిస్తారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

- కలెక్టర్ అభిలాష అభినవ్

తానూరు: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం తెల్ల రేషన్ కార్డులు జారీ చేస్తుందని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో ముధోల్ ఎమ్మెల్యే రామారావ్‌పటేల్‌తో కలిసి గురువారం రేషన్ కార్డులు పంపిణీ చేశారు. తానూరు మండలానికి 1,853 కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. 2,575 రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్లు చేర్చామని వెల్లడించారు. కార్డులు పొందినవారు క్రమం తప్పకుండా రేషన్ బియ్యం తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే రామారావ్ పటేల్ మాట్లాడుతూ రేషన్ కార్డుల పంపిణీ పేదల ఆకలి తీర్చడంతోపాటు అనేక పథకాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, ఆర్డీవో కోమల్‌రెడ్డి, పౌర సరఫరాల శాఖ అధికారి రాజేందర్, శ్రీనివాస్, తహసీల్దార్ మహేందర్, నాయకులు పాల్గొన్నారు.



రేషన్‌కార్డులను అందజేస్తున్న కలెక్టర్ ,ఎమ్మెల్యే

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి..

ప్రభుత్వ ప్రథమిక ఆస్పత్రిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఇన్‌పేషెంట్, ఔట్ పేషెంట్ విభాగాలను, స్టోర్లో మందుల నిల్వలను పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలింతలు, గర్భిణులకు ప్రత్యేక పర్యవేక్షణలో వైద్యం అందించాలన్నారు.

- ఉపాధ్యాయుల సర్దుబాటుపై సంఘాల పెదవి విరుపు
- జిల్లాలో 128 మందికి సర్దుబాటు

లక్ష్మణచాంద: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులేక పిల్లలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా, ఉపాధ్యాయుల సంఖ్య అవసరానికి మించి ఉండగా, మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థులు ఎక్కువగా, ఉపాధ్యాయులు తక్కువగా ఉన్నారు. ఈ అసమతుల్యతను సరిచేసేందుకు, ఏటా విద్యాశాఖ అవసరానికి మించిన ఉపాధ్యాయులను తక్కువ ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేస్తూ విద్యార్థులకు నష్టం జరగకుండా చూస్తోంది. ఈ ఏడాది జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ సర్దుబాటు ప్రక్రియ ఇప్పటికే పూర్తయినట్లు తెలిపారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో 577 ప్రాథమిక పాఠశాలలు, 89 ప్రాథమికోన్నత పాఠశాలలు, 164 ఉన్నత పాఠశాలలు సహా మొత్తం 830 పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో 67,790 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జిల్లాలో మొత్తం 2,984 ఉపాధ్యాయ పోస్టులకుగాను, ప్రస్తుతం 2,571 మంది ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అంటే, 413 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

128 మంది సర్దుబాటు..

రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు కలెక్టర్ అభిలాష అభినవ్ సూచనలతో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియలో 128 మంది ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. వీరిలో 62 మంది భాషా పండితులు, స్కూల్ అసిస్టెంట్లు, 66 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీలు) ఉన్నారు. ఈ సర్దుబాటు ద్వారా విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉండి, ఉపాధ్యాయులు తక్కువగా ఉన్న పాఠశాలల్లో విద్య నాణ్యత మెరుగుపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

ఉపాధ్యాయ సంఘాల ఆందోళన..

అయితే, ఈ సర్దుబాటు ప్రక్రియపై జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలను పాటించకుండా, రాజకీయ ఒత్తిళ్లకు లొంగి ఇష్టారీతిన ఈ ప్రక్రియ జరిగినట్లు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉన్న పాఠశాలలకు సరైన సర్దుబాటు చేస్తే విద్యార్థులకు మరింత ప్రయోజనం చేకూరేదని వారు అభిప్రాయపడ్డారు. ఈ ప్రక్రియను రద్దు చేసి, పారదర్శకంగా మళ్లీ నిర్వహించాలని ఉపాధ్యాయ సంఘాలు జిల్లా విద్యాశాఖ అధికారులను కోరుతున్నాయి.

ఇలా సర్దేశారు!

రద్దు చేయాలని ధర్నా



కల్లూరులో ధర్నా చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

కుంటాల: సర్దుబాటులో భాగంగా మండలంలోని కల్లూరు ప్రాథమిక పాఠశాల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు నవీన్, రవీందర్‌ను వేరే పాఠశాలలకు పంపించారు. నవీన్‌ను లింబా(కె), రవీందర్‌ను అంబుగామ పాఠశాలలకు పంపించారు. దీనిని రద్దు చేయాలని పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల గేటుకు తాళం వేసి నిర్మల్– భైంసా గురువారం ధర్నా చేశారు. మండలంలోని ఇతర పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులు ఉండగా కల్లూరు పాఠశాల నుంచి నవీన్, రవీందర్‌ను పంపడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. వారిని చూసే తమ పిల్లలును ప్రభుత్వ పాఠశాలకు పంపామన్నారు. వారి డిప్యూటేషన్ రద్దు చేయకుంటే తమ పిల్లలను బడి మాన్పిస్తామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కమల్‌సింగ్, ఎస్సై అశోక్ ధర్నా చేస్తున్న పోషకులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. అనంతరం పాఠశాల గేటుకు వేసిన తాళం తీయించి తరగతులు కొనసాగేలా చర్యలు చేపట్టారు.

ఇష్టారీతిన సర్దుబాటు



జిల్లాలో ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి చేపట్టారు. ప్రక్రియ సక్రమంగా లేదు. ఉపాధ్యాయుల అవసరం ఉన్న పాఠశాలలకు కాకుండా తమకు ఇష్టం వచ్చినట్లు ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. దీంతో విద్యార్థులకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. జిల్లాలో మళ్లీ సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలి.

– నరేంద్రబాబు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు

గైడ్‌లైన్స్ సరిగా లేవు..



సర్దుబాటు మార్గదర్శకాలు సరిగా లేవు.11 మంది వి ద్యార్థులు ఉన్నా ఇద్దరు ఉపాధ్యాయులే 59 మంది విద్యార్థులు ఉన్నా ఇద్దరు ఉపాధ్యాయులే. ముందుగా సర్దుబాటు మార్గదర్శకాలను సరిచేయాలి. తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలి. ప్రస్తుత సర్దుబాటులో కొన్ని తప్పిదాలు జరిగాయి.వాటిని సరిచేయాలి.

– దాసరి శంకర్, టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే..



రాష్ట్ర ప్రభుత్వం, పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాల ప్రకారం కలెక్టర్ అభిలాష అభినవ్ అనుమతితో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాం. ఇందులో భాగంగా జిల్లాలో 128 మంది ఉపాధ్యాయులను అవసరం ఉన్నచోటుకు సర్దుబాటు చేశాం. దీంతో విద్యార్థుల ఇబ్బందులు కొంతైనా తీరుతాయి.

– పి.రామారావు, డీఈవో నిర్మల్

ఒక సిమ్‌తో ఒకేసారి కాల్ !

- ఆ తర్వాత సిమ్ లేకుండా ధ్వంసం
- 'జన్నారం సైబర్' కేసులో నిందితుల తీరిదీ
- మాస్టర్ మైండ్ జాక్ ఖాతాలో భారీగా నగదు
- ముమ్మరంగా కేసు దర్యాప్తు, నిందితులకు 14రోజుల రిమాండ్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ఒక ఫోన్‌కాల్‌కు ఒకేసారి సిమ్ వాడుతూ ఆ తర్వాత వాటిని ధ్వంసం చేస్తూ నిత్యం వందలాది కాల్స్ చేస్తూ రూ.లక్షల సొమ్ము కాజేసే యత్నం జరిగింది. జన్నారం కేంద్రంగా సాగిన సైబర్ నేరాన్ని రామగుండం సైబర్ క్రైం పోలీసులు తీవ్రంగా పరిగణించి విచారణ ముమ్మరం చేశారు. ఇప్పటికే ఏడుగురు ఈ కేసులో ఉన్నట్లు గుర్తించారు. నలుగురిని అరెస్టు చేశారు. గురువారం నిందితులను లక్సెట్టిపేట కోర్టులో హాజరుపర్చగా.. వారికి 14రోజుల రిమాండ్ విధించారు. సైబర్ నేరాలు చేసేందుకు ఆధునిక సాంకేతికతను వాడుతూ అమాయక జనాలను కేవలం ఫోన్‌లో మాట్లాడి మభ్యపెడుతూ సొమ్మును తస్కరించే పనుల్లో నిమగ్నమయ్యారు. గత నెలన్నరలోనే వేలాది మందికి ఎక్కడి నుంచో ఫోన్ కాల్స్ చేస్తూ ఇక్కడి లొకేషన్ చూపించేలా ఏర్పాట్లు చేశారు. గోల్డెన్ ట్రయాంగిల్ ఏరియాగా పిలిచే కంబోడియా, మయన్మార్ నుంచి ఈ వ్యవస్థను నియంత్రిస్తున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఆంధ్రాలో రోడ్లపై విక్రయించే వారి నుంచి సిమ్‌లు వందలకొద్దీ కొనుగోలు చేసి, యాక్టివ్ చేసి మాట్లాడగానే పని పూర్తయిన వెంటనే ఆ సిమ్‌ను పాడేసినట్లు గుర్తించారు. ఎప్పటికప్పుడు యాక్టివ్ అయిన సిమ్ వివరాలను ఓ బుక్‌లో రాసుకున్నట్లుగా అధికారులు గుర్తించారు. ఆ బుక్‌లోని వివరాల ప్రకారం ఎవరెవరికి కాల్స్ చేశారు..? ఇందులో ఎంతమొత్తం డబ్బు దోచుకున్నారనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు.



నిందితుల గదిలో వివరాలు సేకరిస్తున్న అధికారులు

జాక్ ఖాతాల్లో రూ.కోట్లలో డబ్బు

ప్రస్తుతం పరారీలో ఉన్న వైజాక్ చెందిన జాక్ అలియాస్ రాజు జన్నారానికి చెందిన వారితోపాటు ఆంధ్రా వారినీ ఈ నేరంలో భాగస్వామ్యం చేస్తూ పథకం రచించాడు. గత మే నుంచే ఈ తంతంగం మొదలు కాగా, గత నెలన్నరగా మోసాలు చేసే ప్రయత్నాలు చేశారు. దర్యాప్తులో భాగంగా జాక్ బ్యాంకు ఖాతాలో రూ.కోటికిపైగా లావాదేవీలు ఉన్నట్లు గుర్తించారు. అంతేకాక అతడు చెప్పినట్లు చేసినందుకు రూ.లక్షల్లో డబ్బు స్థానికులకు పంపాడు. మోసం చేస్తున్నామని తెలిసినా జన్నారం వాసులు ఇందులో ఇరుక్కుపోయారు.

ఐఎంఈఐ కనిపించకుండా

సైబర్ నేరగాళ్లు కాల్స్ చేస్తే వాళ్లు చేసే ప్రాంతం, చూపించే లొకేషన్ భిన్నంగా ఉండేందుకే జన్నారంను ఎంపిక చేసుకున్నట్లు అధికారులు గుర్తించారు. ఒక సిమ్ బాక్స్‌లో ఒకేసారి 256సిమ్‌లు వాడుతూ, ఐఎంఈఐ కూడా గుర్తించకుండా ఉండేలా జాగ్రత్త పడ్డారు. అంతేకాక లొకేషన్ ట్రేస్ చేస్తే అడవులు, కొండల మధ్య టవర్ సిగ్నల్స్‌ను ఎక్కడి నుంచి చేస్తున్నారో తెలుసుకోవడం కష్టంగా మారుతుంది. ఈ క్రమంలో ముందుగా జన్నారం పోలీసులు ఆ చూకీ వెతికినా నేరగాళ్లు బయటపడలేదు. ఇదంతా కంబోడియా నుంచే పూర్తిగా ఈ వ్యవహారం నడిచిందా? వీరి వెనకాల ఇంకా ఎవరెవరు ఉన్నారు. వీరిలో చేతిలో ఎంతమంది మోసపోయారు? దోచిన డబ్బు ఏ ఖాతాల్లోకి వెళ్లిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. అయితే నేరంలో ప్రధానంగా వ్యవహరించిన జాక్ దొరికితేనే ఈ కేసు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని పోలీసు అధికారులు చెబుతున్నారు. అతన్ని పట్టుకోవడం కోసం లుక్‌అవుట్ నోటీసులు జారీ చేసేందుకు సిద్ధమయ్యారు.

ధీరనారీ.. ధైర్యశాలి

- గస్తీల్లో దూసుకెళ్తున్న నిర్మల్ మహిళా పోలీసులు
- పెట్రోలింగ్, శాంతిభద్రతలు, ట్రాఫిక్ విధుల్లో సక్సెస్
- ప్రశంసలు కురిపిస్తున్న జిల్లావాసులు


నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిలతో మహిళా కానిస్టేబుళ్లు

నిర్మల్‌టౌన్: మహిళా దినోత్సవం సందర్భంగా నిర్మల్ జిల్లా ఎస్పీ జానకీ షర్మిల 'నారీశక్తి' కార్యక్రమంలో భాగంగా మహిళా కానిస్టేబుళ్లకు పెట్రోలింగ్ విధులను కేటాయించారు. ఐదు నెలలుగా, ఈ విధుల్లో మహిళా పోలీసులు అద్భుత పనితీరుతో జిల్లా ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రతీ పోలీస్ స్టేషన్‌లో ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు గస్తీ, డయల్ 100 కాల్స్‌కు స్పందించడం, శాంతిభద్రతల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, రాత్రి గస్తీ, పరిశోధన వంటి కీలక బాధ్యతలను ధైర్యంగా నిర్వర్తిస్తున్నారు. వారి సత్తాను ప్రదర్శిస్తూ, ఈ అవకాశం కల్పించిన ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

క్షేత్రస్థాయి విధుల్లో..

గతంలో మహిళా కానిస్టేబుళ్లు స్టేషన్‌లో రికార్డుల నిర్వహణ, ధర్నాలు, నిరసనలు, ర్యాలీల వంటి విధులకే పరిమితమయ్యేవారు. అయితే ఎస్పీ జానకీ షర్మిల తొలిసారిగా సరికొత్త చొరవ తీసుకొచ్చారు. జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలోని మహిళా కానిస్టేబుళ్లకు వారానికి ఒకరోజు పెట్రోలింగ్, డయల్ 100 స్పందన, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు వంటి క్షేత్రస్థాయి విధులను అప్పగించారు. మార్చి 8 నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మహిళా కానిస్టేబుళ్లు తమ విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు.

మహిళల రక్షణలో కీలక పాత్ర..

డయల్ 100 కాల్స్‌కు వేగంగా స్పందిస్తూ ఆపదలో ఉన్న మహిళలను రక్షించడంలో ఈ మహిళా పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారు. శాంతిభద్రతల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, రాత్రి గస్తీ వంటి సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ వారు తమ సామర్థ్యాన్ని చాటుతున్నారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళా కానిస్టేబుళ్లు కేవలం స్టేషన్‌కు పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో చురుకైన పాత్ర పోషిస్తూ సమాజానికి సేవ చేస్తున్నారు.

ఎస్పీతో ముఖాముఖి..

నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ జానకీ షర్మిల మహిళా కానిస్టేబుళ్లతో గురువారం ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారి అనుభవాలు, సవాళ్లు, విజయాలపై చర్చించారు. కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగ బాధ్యతలను సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని సూచించారు. మహిళా పోలీసులు తమకు లభించిన ఈ అవకాశంతో తమ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని ఎస్పీ ప్రశంసించారు. ఈ సందర్భంగా పలువురు మహిళల అభిప్రాయాలువారి మాటల్లో..

ఓ ప్రాణాన్ని రక్షించా..



ఒక రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు సంఘటన స్థలానికి వేగంగా వెళ్లి గాయపడిన వ్యక్తిని తక్షణమే ఆస్పత్రికి తరలించేందుకు అన్నిఏర్పాట్లు చేశాం. ఆ సమయంలో నాకు కలిగిన సంతృప్తి మాటల్లో చెప్పలేనిది. మేము కూడా అత్యవసర పరిస్థితిలో ప్రాణాలను కాపాడగలమనే నమ్మకం నాలో కలిగింది. ఈ అవకాశం కల్పించిన ఎస్పీ జానకీ షర్మిల మేడంకు ప్రత్యేక కృతజ్ఞతలు.

– రాజమణి, ముధోల్ పోలీస్‌స్టేషన్

ధైర్యంతో ముందుకు..



ఒకప్పుడు నాలో చాలా భయం ఉండేది. కానీ నారీశక్తి కార్యక్రమంతో ఆ భయం తొలగిపోయింది. ఇప్పుడు నేను ధైర్యంగా విధులు నిర్వహిస్తున్నా. మఫ్టీలో ఉన్నా ప్రజలు నన్ను పోలీసుగా గుర్తిస్తున్నారు. ఎంతో గర్వంగా అనిపిస్తోంది. ఈ మార్పుకు కారణం మా ఎస్పీ మేడమే.

– షహనో భాను, నర్సాపూర్ పోలీస్‌స్టేషన్

ఇన్ఫోసిస్ నుంచి..



బీటెక్ పూర్తిచేసి ఇన్ఫోసిస్‌లో ఉద్యోగంలో చేరా. ఆతర్వాత పోలీస్‌శాఖలో ఉద్యోగం వచ్చింది. ఎస్పీ మేడం ప్రారంభించిన నారీశక్తి వల్ల ప్రజలు నన్ను 'పోలీస్ అక్క' అని పిలుస్తున్నారు. ప్రజలకు సహాయం చేస్తున్నప్పుడల్లా నాకు ఒక కొత్త ఉత్సాహం కలిగింది. ఆ క్షణంలో నాకు కార్పొరేట్ టైటిల్ కంటే ఖాకీ యూనిఫామ్ గొప్పదని తెలిసింది.

– సంధ్య, సోన్ పోలీస్‌స్టేషన్

మహిళ ప్రాణాలు కాపాడా..



నారీశక్తి విధుల్లో చేరిన మొదటి రోజే నాకు డయల్ 100 ద్వారా ఓ ఆత్మహత్య ప్రయత్నం గురించి సమాచారం వచ్చింది. భయం వేసి ఎలా స్పందించాలో తెలియక కొంచెం తడబడ్డా. ఆ క్షణమే నాలో ఏదో తెలియని ధైర్యం వచ్చేసింది. ఆత్మహత్యకు పాల్పడబోయే మహిళ ప్రాణాలు కాపాడా.

– శివాని, నిర్మల్ వన్‌టౌన్

రిసెప్షన్ నుంచి రెస్పాన్స్ వరకూ..



నారీశక్తి కార్యక్రమం, మా ఎస్పీ మేడమ్ ప్రోత్సాహంతో డ్యూటీలో పూర్తి సంతృప్తి పొందుతున్నా. ఒకప్పుడు రిసెప్షన్ విధులకే పరిమితమైన మేము నారీశక్తి కార్యక్రమంతో డయల్ 100 విధిని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొంటున్నాం. ధైర్యంగా ముందుకెళ్తూ లింగభేదం అనేది ఎలాంటి అడ్డంకి కాదని నిరూపిస్తున్నాం.

– శ్రీలత, లక్ష్మణచాంద పోలీస్‌స్టేషన్

క్లుప్తంగా

చెరువులో మునిగి రెండు ఎడ్లు మృతి


మృతి చెందిన ఎడ్ల వద్ద రైతు పోతన్న

లక్ష్మణచాంద: చెరువులో నీటమునిగి రెండు ఎడ్లు మృతి చెందిన సంఘటన మండలంలోని కనకాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మేకల పోతన్న గురువారం గ్రామ శివారులోని పొలంలో వరి నాటు వేశాడు. అనంతరం ఇంటికి వచ్చేక్రమంలో ఎడ్లను బండికి కట్టి వాటి దాహం తీర్చేందుకు రెడ్డికుంట చెరువులోకి దింపాడు. ఒక్కసారిగా బండి లోపలికి జారడంతో బండితో సహా ఎడ్లు చెరువులో దిగబడ్డాయి. దీంతో బండి నుంచి ఎడ్లు విడిపోకపోవడంతో నీటిలో మునిగి ఊపిరాడక మృత్యువాత పడ్డాయి. వాటి విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు. పశు వైద్యుడు శ్రీనివాస్, ఆర్ఐ నరేందర్‌రెడ్డి, పంచాయతీ సెక్రెటరీ రవి, పంచనామా నిర్వహించారు.

యువతిని మోసగించిన ఆర్మీ ఉద్యోగికి పదేళ్ల జైలు

కాగజ్‌నగర్‌రూరల్: యువతిని మోసగించిన ఆర్మీ ఉద్యోగికి పదేళ్ల జైలుశిక్ష, రూ.35 వేల జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి ఎంవీ.రమేశ్ గురువారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ కాంతిలాల్ పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈజ్‌గాం ట్రాక్టర్ షెడ్డు సమీపంలో నివాసముంటున్న మోహనంద్ సర్కార్ ఓ యువతిని ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసగించాడు. 2019 జూలై 30న సదరు బాధితురాలు ఈస్‌గాం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సై రాజేశ్వర్ కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరు పర్చగా నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చారు. ఈ కేసులో నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన ప్రస్తుత డీఎస్పీ రామానుజం, రూరల్ సీఐ కుమారస్వామి, ఈజ్‌గాం ఎస్సై కల్యాణ్, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

మోసగించిన ఇద్దరిపై కేసు నమోదు

కౌటాల: ఉద్యోగం ఇప్పిస్తానని మోసగించిన ఆసిఫాబాద్‌కు చెందిన పుల్కర్ సాయికుమార్‌పై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. మండలంలోని ముత్తంపేటకు చెందిన బసర్కార్ మయూరి, పార్డీ గ్రామానికి చెందిన కోబ్రాగడే గీతకు ఆరోగ్య శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి వారివద్ద రూ.3 లక్షల నగదు తీసుకున్నాడు. సిర్పూర్(యు), వాంకిడి ఆస్పత్రుల్లో జిల్లా వైద్యశాఖ అధికారి పేరు మీద నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చి మోసం చేశాడన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గురుకులంలో సీటు ఇప్పిస్తానని..

గురుకుల పాఠశాలల్లో సీట్లు ఇప్పిస్తానని మోసగించిన ఆసిఫాబాద్‌కు చెందిన కామ్రె ప్రశాంత్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. కౌటాల మండలంలోని మొగడ్‌దగడ్‌కు చెందిన ఎల్ములే సంతోష్ కుమార్తె పల్లవికి జ్యోతి బాపూలే గురుకుల పాఠశాలలో సీటు ఇప్పిస్తానని రూ.10 వేలు తీసుకున్నాడు. సీటు ఇప్పించకపోవడంతో బాధితుడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

14 వాహనాలు సీజ్


సీజ్ చేసిన వాహనాలతో పోలీసులు

ఇచ్చోడ: మండలంలో గురువారం రాత్రి నాకాబందీ నిర్వహించి సరైన ధ్రువీకరణ పత్రాలు, నంబర్‌ప్లేట్‌లేని 14 వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు నాకాబందీ కార్యక్రమం నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న తునికాకు పట్టివేత


పట్టుకున్న తునికాకుతో అటవీ అధికారులు

ఉట్నూర్‌రూరల్: అక్రమంగా తరలిస్తున్న తునికాకును గురువారం పట్టుకున్నట్లు బీర్సాయిపేట్ అటవీ రేంజ్ అధికారి అరుణ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు మండలంలోని వడోని గ్రామానికి చెందిన జాదవ్ రవీందర్ ఉడుంపూర్ నుంచి వడోని గ్రామానికి సుమారు రూ.30 వేల విలువైన తునికాకును పది సంచుల్లో నింపి టవేరా వాహనంలో తరలిస్తుండగా దంతన్‌పల్లి వద్ద పట్టుకున్నట్లు ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారి ప్రియాంక, సెక్షన్ అధికారి లచ్చన్న, బీట్ అధికారి సందీప్, తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థికసాయం


చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఎలుగుబంటి దాడిలో గాయపడిన మావల మండలం వాఘపూర్ గ్రామానికి చెందిన చాహకటి దేవురావుకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ప్రభుత్వం రూ.50 వేలు మంజూరు చేసింది. కలెక్టర్ రాజర్షి షా గురువారం తన చాంబర్‌లో బాధితుడికి చెక్కు అందజేశారు. కొలాం గిరిజన తెగకు చెందిన దేవురావు ఈఏడాది మే నెలలో గాయపడ్డాడు. ఆర్థికసాయం మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కలెక్టర్ రాజర్షి షాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన బాను వాసుదేవ్‌రావు దివ్యాంగుల కాలనీలో పేపర్ ప్లేట్ల దుకాణం నడిపిస్తున్నాడు. బుధవారం రాత్రి దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లాడు. గురువారం ఉదయం దుకాణం తీసేందుకు వెళ్లగా షట్టర్ తాళం పగులగొట్టి ఉంది. కౌంటర్‌లో ఉన్న రూ.10వేల నగదు చోరీకి గురైందని బాధితుడు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో..

ఆదిలాబాద్ పట్టణంలోని కుమ్మరికుంటలో నివాసం ఉంటున్న ఠాకూర్ సరోజ గత నెల 10న మహారాష్ట్రలోని కిన్వట్‌లో గల తన కూతురు ఇంటికి వెళ్లింది. గురువారం ఇంటికి వచ్చిచూడగా తాళం పగులగొట్టి ఉంది. ఇంట్లో ఉన్న 5 తులాల వెండీ అపహరణకు గురైనట్లు గుర్తించింది. వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


చరణ్‌తేజను సన్మానిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఈ నెల 4 నుంచి 8 వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూర్‌లో జరగనున్న జాతీయ స్థాయి జూనియర్ స్విమ్మింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారుడు కే.చరణ్ తేజ ఎంపికయ్యాడు. గత నెల 19, 20 తేదీల్లో హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన జూనియర్, సబ్ జూనియర్ స్విమ్మింగ్ కాంపిటీషన్ వాటర్ పోలోలో రాణించాడు. సదరు క్రీడాకారుడిని కలెక్టర్ రాజర్షి షా గురువారం తన చాంబర్‌లో శాలువాతో సత్కరించి మెడల్ అందజేశారు. జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్, బాలూరి గోవర్ధన్ రెడ్డి, పార్థసారథి, స్విమ్మింగ్ సెక్రెటరీ మహేంద్రజిత్ కుమార్, కోచ్ కొమ్ము కృష్ణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

జనహిత పాదయాత్రకు తరలిరావాలి


మాట్లాడుతున్న పార్లమెంట్ ఇన్‌చార్జి రాంభూపాల్

ఖానాపూర్: నియోజకవర్గంలో ఈ నెల 3, 4 తేదీల్లో నిర్వహించనున్న జనహిత పాదయాత్రకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో తరలిరావాలని పార్లమెంట్ ఇన్‌చార్జి రాంభూపాల్, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కోరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో పాటు టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాల అమలుపై పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 3న బాదన్‌కూర్తి నుంచి ఖానాపూర్ పట్టణంలో పాదయాత్ర కొనసాగుతుందన్నారు. 4న ఖానాపూర్‌లో శ్రమదానం, స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ శ్రేణులతో సమావేశం ఉంటుందన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్, పడిగెల భూషణ్, ఎంఏ మజీద్, దయానంద్, చిన్నం సత్యం, అంకం రాజేందర్, తోట సత్యం, యూసుఫ్‌ఖాన్, మడిగెల గంగాధర్, జహీర్ అహ్మద్, షౌకత్‌పాషా, జంగిలి శంకర్, బాలసంకుల రాజేందర్, శ్రీపాద శేషాద్రి, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి కన్నీటి వీడ్కోలు

- కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగింత
- యాజమాన్యంపై కుటుంబీకుల ఫిర్యాదు
- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


మృతుని తండ్రిని ఓదార్చుతున్న కుటుంబ సభ్యులు


మృతదేహానికి నివాళులర్పిస్తున్న రిమ్స్ అధికారులు, మెడికోలు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్ వైద్య విద్యార్థి సాహిల్ చౌదరికి రిమ్స్ వైద్యులు, ఉద్యోగులు, మెడికోలు, నర్సింగ్ విద్యార్థులు కన్నీటి వీడ్కోలు పలికారు. బుధవారం రిమ్స్ వసతిగృహంలో సాహిల్ చౌదరి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. గురువారం రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, వైద్యులు అశోక్, హేమలత, శిరీష్, దీపక్ పుష్కర్, బండారి నరేందర్, వైద్య విద్యార్థులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రిమ్స్ యాజమాన్యంపై అనుమానం..

వైద్య విద్యార్థి కుటుంబీకులు రాజస్థాన్‌లోని జైపూర్ నుంచి గురువారం ఉదయం 7 గంటల ప్రాంతంలో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు చేరుకున్నారు. కుమారుడి మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఆత్మహత్యకు సంబంధించి రిమ్స్ యాజమాన్యంపై అనుమానం ఉందని చెప్పడంతో టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అంతకుముందు మృతుడి తండ్రి హర్పుల్ చౌదరి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌ను కలిశారు. పలు విషయాలను ఆయన దృష్టికి తీసుకెళ్లి పూర్తిస్థాయి విచారణ జరిపించాలని కోరారు.

కుమారుడు కాదు.. స్నేహితుడిలా ఉండేవాడు

తాను ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నానని, తన భార్య ఆచిదేవి గృహిణి అని, తమకు ముగ్గురు కుమారులు ఉన్నారన్నారు. పెద్ద కుమారుడు సాహిల్ చౌదరి చిన్ననాటి నుంచి చదువులో రాణిస్తున్నాడని తండ్రి కంటతడి పెడుతూ చెప్పుకొచ్చాడు. ఆర్థికంగా ఎలాంటి ఇబ్బందులు లేవని, తోటి విద్యార్థులు ర్యాగింగ్‌కు పాల్పడలేదని, గతేడాది పరీక్షలు సైతం బాగా రాసి ఉత్తీర్ణుడైనట్లు పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10.20 గంటలకు తనతో ఫోన్‌లో మాట్లాడాడని, సాధారణ విషయాలే తప్పా ఎలాంటివి చెప్పలేదన్నాడు. పరీక్షలు అంటే భయపడాల్సిన అవసరం లేదని, సప్లిమెంటరీ రాసుకోవచ్చని సూచించినట్లు పేర్కొన్నారు. తన కుమారుడు స్నేహితుడిలా ఉండేవాడని, ప్రతీరోజు సాయంత్రం ఫోన్‌చేసే వాడన్నారు. డాక్టర్ కావాల్సిన తన కుమారుడిని కోల్పోవడం చాలా బాధగా ఉందని కంటతడిపెట్టారు.

నకిలీ పురుగు మందులు పట్టివేత


పురుగు మందులు పరిశీలిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: అమాయక రైతులకు నకిలీ పురుగుల మందు విక్రయించేందుకు మహారాష్ట్ర నుంచి తీసుకువస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. గురువారం రాత్రి ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మివాడ రైల్వే బ్రిడ్జి సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇంద్రవెల్లిలోని ధనోరకు చెందిన నర్వాటే రామేశ్వర్ తన కారు డిక్కీలో 51 నకిలీ పురుగుల మందు బాటిళ్లను తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. మందులతో పాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సంఘటన స్థలాన్ని డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి పరిశీలించారు. ఇదిలా ఉండగా నాకాబందీలో భాగంగా సాయంత్రం 5 నుంచి 7:30 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసులు చేపట్టిన తనిఖీల్లో 36 డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేశారు. నంబర్ ప్లేట్లు లేని 41 వాహనాలను స్వాధీనం చేసుకోగా, సరైన ధ్రువపత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. మహారాష్ట్ర సరిహద్దు, అంతర్‌జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు.

కడెం ప్రాజెక్ట్‌పై ఫోకస్

- అధికార యంత్రాంగం అలర్ట్
- ముప్పు నివారణకు చర్యలు


కడెం ప్రాజెక్ట్


ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ జానకీషర్మిల (ఫైల్)

కడెం: కడెం ప్రాజెక్ట్‌కు 2022, 2023లో వచ్చిన భారీ వరద ప్రజలను భయాందోళనకు గురిచేసింది. అప్పటి నుంచి వానాకాలం వచ్చిందంటే ప్రాజెక్ట్ దడ పుట్టిస్తోంది. వరదలతో దెబ్బతిన్న ప్రాజెక్ట్‌ను అప్పటి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో రెండేళ్లు వరుసగా డేంజర్ జోన్‌లోకి వెళ్లింది. గతంలో జరిగిన ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా వరద ముప్పు తప్పేలా రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. వరదలతో దెబ్బతిన్న కడెం ప్రాజెక్ట్‌కు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ చొరవతో గతేడాది రాష్ట్ర ప్రభుత్వం రూ.9.46 కోట్లు కేటాయించడంతో ప్రాజెక్ట్‌కు పూర్తిస్థాయి మరమ్మతులు చేశారు. ఈ ఏడాది ఆయకట్టు ఎడమ కాలువకు రూ.33.5లక్షలతో కడెం, దస్తురాబాద్ మండలాల పరిధిలోని 16కిలోమీటర్ల మేర మరమ్మతులు చేపట్టారు. పిచ్చిమొక్కలు, చెత్తాచెదారం, పూడిక తీయించారు. దెబ్బతిన్నచోట కాలువలకు మరమ్మతులు చేశారు.

అధికార యంత్రాంగం అప్రమత్తం

గత సంఘటనలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం కడెం ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. ఇటీవలే నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి హరికిరణ్, ఎస్పీ జానకీషర్మిల ప్రాజెక్ట్‌ను సందర్శించి పరిస్థితి సమీక్షించారు. ప్రాజెక్ట్ లోతట్టు ప్రాంతాల్లో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్‌కు విపత్కర పరిస్థితులు తలెత్తితే లోతట్టు ప్రాంతాల ప్రజలను రక్షించేందుకు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని సిద్ధంగా ఉంచారు. నీటి పారుదలశాఖ అధికారులను కలెక్టర్ ఎప్పటికప్పుడు అలర్ట్ చేస్తున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం



వర్షాకాలం కావడంతో ఇరిగేషన్ సిబ్బంది అంతా అప్రమత్తంగా ఉన్నారు. కలెక్టర్, ఇరిగేషన్ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నారు. ప్రాజెక్ట్‌కు ఎలాంటి ఇబ్బంది లేదు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– విఠల్, ఈఈ

ముందస్తు జాగ్రత్త

గత రెండేళ్ల ప్రాజెక్ట్‌కు కనీవిని ఎరుగని రీతిలో భారీ వరదలు రావడంతో ఇరిగేషన్ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు. గతంలో ప్రాజెక్ట్ నీటిమట్టాన్ని 699,698 గా మెయింటేన్ చేసేవారు. కానీ, అనుకోని రీతిలో ఒక్కసారిగా భారీ వరదలు వస్తున్న నేపథ్యంలో నీటిమట్టాన్ని 695 అడుగులుగా మెయింటేన్ చేస్తున్నారు. ఇంకా వర్షాకాల సీజన్ ఉన్నందున ప్రస్తుతానికి ఇలా మెయింటేన్ చేస్తూ ఆగస్టు, సెప్టెంబర్ వరకు పూర్తి స్థాయి నీటిమట్టం ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.

మహారాష్ట్ర కూలీ హఠాన్మరణం


మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ నైలు

కుంటాల: మహారాష్ట్రకు చెందిన మహిళా కూలీ హఠాన్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని కిన్వట్ తాలూకా మాన్సింగ్ తండాకు చెందిన సుమన్ బాయి (40) తోటి కూలీలతో కలిసి బుధవారం ఉదయం అంబకంటి తండాకు చెందిన రవి చౌహాన్ వరి పొలంలో నాటు వేసేందుకు వచ్చింది. సాయంత్రం సమయంలో ఒక్కసారిగా కిందపడిపోవడంతో చికిత్స నిమిత్తం భైంసా ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మృతదేహాన్ని భైంసా రూరల్ సీఐ నైలు పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

2న కబడ్డీ జిల్లా జట్ల ఎంపిక

శ్రీరాంపూర్: ఆగస్టు 2న జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాంచందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో నిర్వహించనున్న పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 3న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే యువ తెలంగాణ ప్రీమియం లీగ్ పోటీల్లో పాల్గొంటారన్నారు. అందులో ప్రతిభ కనబర్చిన వారు 27 నుండి సెప్టెంబర్ 8 వరకు జరిగే తెలంగాణ ప్రీమియర్ లీగ్‌లో పాల్గొంటారన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు రేపు ఉదయం 9 గంటలకు అసోసియేషన్ ఈసీ సభ్యుడు కార్తీక్‌కు రిపోర్ట్ చేయాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాలఅగ్రికల్చర్: హైదరాబాద్‌లోని పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశానికి ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి గానూ మంచిర్యాల జిల్లాకు రెండు సీట్లు కేటాయించినట్లు తెలిపారు. జూన్ 1, 2018 నుంచి మే 31, 2019 మధ్య జన్మించి ఉండాలన్నారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో లక్షా యాభైవేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2లక్షలు ఉండాలన్నారు.

అమృత్ భారత్‌తో మెరుగైన సౌకర్యాలు


పనుల పురోగతి తెలుసుకుంటున్న డీఆర్ఎం

ఆదిలాబాద్: అమృత్ భారత్ స్టేషన్ పథకం ద్వారా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు లభిస్తాయని నాందేడ్ డివిజనల్ మేనేజర్ ప్రదీప్ కాంబ్లే అన్నారు. గురువారం నాందేడ్ డివిజన్ పరిధిలోని ఆదిలాబాద్ సెక్షన్‌లో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌యూబీ, ఆర్‌ఓబీ నిర్మాణాలతో భద్రతపరంగా ఎంతో వెసులుబాటు ఉంటుందన్నారు. ప్రమాదాలు తగ్గడంతో పాటు రైలు రాకపోకలకు మెరుగైన సదుపాయం అందుబాటులోకి వస్తుందన్నారు. పనుల్లో నాణ్యతను పాటించడంతో పాటు వేగవంతంగా పూర్తిచేయాలన్నారు. అంతకుముందు ఆదిలాబాద్ రైల్వే స్టేషన్‌లో పిట్‌లైన్ లిఫ్ట్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. ఆదిలాబాద్ పరిధిలో నిర్మితమవుతున్న ఎల్‌సీ–30 ఆర్‌యూబీ, ఎల్‌సీ–29 ఆర్‌ఓబీ, కోసాయి, అంబాడి స్టేషన్ల మధ్య ఎల్‌సీ–19 బదులు ఆర్‌యూబీ నిర్మాణం గురించి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు.